క్లుప్తంగా

మినీ వాటర్ ట్యాంకు వితరణ



సత్యవేడు: మండలంలోని మదనంబేడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు మాజీ సర్పంచ్ ఎత్తిరాజులు కుమారుడు రజనీకాంత్ రూ. 16 వేలు విలువ చేసే సింథటిక్ మినీ వాటర్ ట్యాంకును వితరణ చేశారు. ఉన్నత పాఠశాలో ఉన్న వాటర్‌ట్యాంకు శిలావస్థకు చేరడంతో మాజీ సర్పంచ్ రాము, ప్రస్తుత సర్పంచ్ భర్త వెంకటేశ్వర్లు కలసి వాటర్ ట్యాంకు ఏర్పాటు చేయాలని రజీకాంత్‌ను అభ్యర్థించారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఉన్నత పాఠశాలకు 2 వేల లీటర్ల నిల్వ సామర్థ్యం ఉన్న ట్యాంకు అందజేశారు.

మజ్దూర్ యూనియన్‌లో చేరిక



సీఆర్ఎస్‌లో మజ్దూర్ యూనియన్‌లో చేరిన సభ్యులు

రేణిగుంట: స్థానిక సీఆర్ఎస్‌లోని 100 మంది రైల్వే కార్మికులు బుధవారం ఎంప్లాయిస్ సంఘ్ నుంచి సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్‌లో చేరారు. వారిని యూనియన్ బ్రాంచి సెక్రటరీ సురేంద్రరెడ్డి అభినందించారు. యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్రావు ఆదేశాల మేరకు కార్మికుల సమస్యలపై తాము కూడా అలుపెరుగని పోరాటం చేస్తామని యూనియన్‌లో చేరిన వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు, సదాశివ రెడ్డి, మునిరాధయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శ్రీపాద కూలీల సేవలు అజరామరం



శ్రీపాద కూలీలు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శ్రీపాద కూలీల సేవలు అజరామరం. దేవుడు బయటకు రావాలంటే వారు కచ్చితంగా ఉండాల్సిందే. ఆలయంలో అలంకార మండపం నుంచి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మోసుకుని వస్తారు. ప్రత్యేకంగా కొండచుట్టూ 16 కిలోమీటర్లు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మోసుకుంటూ నడవడం అంత సులువు కాదు. శ్రీకాళహస్తి ఆలయంలో తుపాన్ సెంటర్, చుక్కలనిడిగల్లు ప్రాంతానికి చెందిన 64 మంది శ్రీపాద కూలీలు పనిచేస్తున్నారు. ఆలయ సిబ్బందిగా తీసుకోవాలని వారు అనేక ఏళ్లుగా కోరుతున్నారు. 16 మంది చొప్పున నాలుగు బృందాలుగా 64 మంది శ్రీపాద కూలీలు పనిచేస్తున్నారు.

నేటి నుంచి భావనారుషి వార్షిక బ్రహ్మోత్సవాలు

పిచ్చాటూరు: నాగలాపురం భద్రావతీ సమేత భావనారుషి ఆలయంలో గురువారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు కుప్పయ్య, మధు తెలిపారు. 23న విఘ్నేశ్వర పూజ, 24న కల్యాణోత్సవం, పులివాహన సేవ, 25న మహానైవేద్యం కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు చెప్పారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వర స్వామి కల్యాణోత్సవం

ఏర్పేడు: శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య ఆధ్వర్యంలో స్థానిక గుంటకట్టపై ఉన్న కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

ఏర్పేడు: బాల్యవివాహాల నిర్మూలనకు సమష్టిగా కృషి చేద్దామని ప్రజాప్రగతి ట్రస్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మై చాయిస్ స్వచ్ఛంద సంస్థ, ప్రజా ప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదరికం, నిరక్షరాస్యత కారణంగానే బాల్యవివాహాలు జరుగుతున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రేమలత, తొట్టంబేడు సీడీపీఓ ఫర్జానా, మై చాయిస్ స్వచ్ఛంద సంస్థ కో–ఆర్డినేటర్ క్రాంతి, ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్, ప్రతినిధులు చెంచు రామయ్య, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.



ఎదురు సేవా మండపం వద్ద వేచి వున్న భక్తులు



స్వామి, అమ్మవార్లకు హారతి ఇస్తున్న భక్తులు



గిరి ప్రదక్షిణలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, భక్తులు



ఆకట్టుకుంటున్న కళారూపాలు

అడుగడుగునా హారతులు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కొండచుట్టును ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గిరి ప్రదక్షిణ చేశారు. శ్రీకాళహస్తీశ్వరుడి కల్యాణానికి విచ్చేసిన రుషులు, దేవతలను సాగనంపేందుకు కైలాస గిరుల చుట్టూ 16 కిలోమీటర్లు ప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 6.30 గంటలకు అభిషేకానంతరం అలంకారం మండపంలో స్వామి, అమ్మవార్లను అలంకరించారు. కైలాసగిరుల చుట్టూ ప్రదక్షిణ చేసిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్థానికులు పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లు సాయంత్రం శుక బ్రహ్మాశ్రమం సమీపంలో ఉన్న ఎదురు సేవ మండపం వద్దకు చేరుకున్నారు. ఎదురు సేవకు శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన వారే కాకుండా ఇతర ప్రాంతాల వారు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. గిరిప్రదక్షిణం నుంచి తిరిగి వచ్చిన స్వామి, అమ్మవార్లకు ఘనంగా స్వాగతం పలికి పట్టణంలోకి తీసుకొచ్చారు. అశ్వ వాహనంపై స్వామి, సింహ వాహనంపై అమ్మవారు ఊరేగారు. సాంస్కృతిక, కళాబృందాలు, మేళతాళాలు వెంటరాగా ఊరేగింపు జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో కె.వి.సాగర్‌బాబు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళారూపాలు

స్వామి అమ్మవార్లు గిరిప్రదక్షిణలో భాగంగా బుధవారం ఏర్పాటుచేసిన వివిధ కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఈ ఏడాది 11 ట్రాక్టర్లు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క ట్రాక్టర్‌లో వేద విద్యార్థులు, కళారూపాలు, కళాకారులు, అఘోర వేషధారణలో కళాకారులు, కోలాటాల బృందాలు, చెక్కభజనలు, ఆదిశేష శివలింగం, నంది మీద ఊరేగుతున్న శివయ్య ప్రతిమ, కేరళ వాయిద్యాలు, లంబాడీలు ఏర్పాటుచేశారు. రష్యా, ఉక్రెయిన్ వాసులు బేరి మండపం వద్ద చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి.

గిరిప్రదక్షిణ మార్గం అద్భుతం



మేము ప్రతి ఏటా గిరిప్రదక్షిణకు వస్తుంటాం. ఈ ఏడాది ఏర్పాట్లు చాలా అద్భుతంగా ఉన్నాయి. నూతనంగా వేసిన సిమెంటు రోడ్డులో నీటితో తడుపుతూ నడిచేందుకు ఇబ్బంది లేకుండా చేశారు. చాలా ఆనందంగా ఉంది.

–తులసి, తిరుపతి

ముందుకంటే బాగుంది



నేను మూడేళ్ల క్రితం గిరి ప్రదక్షిణకు వచ్చాను. అప్పుడు సౌకర్యాలు అంతంతమాత్రమే. ప్రస్తుతం బాగున్నాయి. భోజనం, మజ్జిగ, పండ్లు వంటివి పంపిణీ చేశారు. రోడ్డులో నీటితో తడపడంతో ఇబ్బంది లేకుండా నడిచాం.

–శివమ్మ, మదనపల్లి

సౌకర్యాలు బాగున్నాయి



నేనే ఏడేళ్ల క్రితం మహాశివరాత్రి గిరిప్రదక్షిణలో పాల్గొన్నాను. రోడ్డు రాళ్ల రప్పలతో నడవలేని స్థితిలో ఉండేది. ఈ ఏడాది సిమెంట్ రోడ్డు వేశారు. అన్ని సౌకర్యాలు బాగున్నాయి. అన్నదానం, స్టాల్స్ ఏర్పాటుచేశారు.

–గోపాల్, అనంతపురం

గిరిప్రదక్షిణ మార్గం బాగుంది



గతంలో కొండచుట్టుకు వచ్చి ఆకలితో ఇబ్బంది పడేవాళ్లం. రోడ్డు కూడా అధ్వానంగా ఉండేది. ఇప్పుడు రోడ్డు వేశారు. అడుగడుగునా మంచి నీరు, అన్నదానం, పండ్ల పంపిణీ చేశారు. చాలా సంతోషంగా ఉంది.

–సరస్వతి, పెంకులపాడు



భరద్వాజ తీర్థం

శివానంధైక నిలయం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): కైలాసం తర్వాత అంతటి ఉన్నతమైనది దక్షిణ కైలాసం. హిమాలయ పర్వతాలలోని కైలాసానికి దక్షిణం వైపున ఉండడం వల్ల శ్రీకాళహస్తి క్షేత్రానికి దక్షిణ కైలాసమనే పేరు వచ్చింది. సృష్టికార్యం మరిచిన బ్రహ్మ శివుని సలహాపై కైలాసంలోని ఆనంధైక నిలయం (శయన మందిరం) అనే పర్వతాన్ని తీసుకుని భూలోకానికి బయలుదేరాడు. ఈ క్రమంలో పర్వతం జారి కింద పడింది. ఆ ప్రాంతాన్ని దక్షిణ కైలాసంగా (శ్రీకాళహస్తిగా) గుర్తించి పంచముఖ శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. తర్వాత తపస్సు చేసి సృష్టికార్యం చేయ దానికి శక్తులను తిరిగి పొందాడు. అందువల్ల శ్రీకాళహస్తి క్షేత్రాన్ని శివానంధైక నిలయంగా పిలుస్తారు. ప్రతిరోజూ ఆలయంలోని అమ్మవారి సన్నిధి వద్ద ఉన్న శయన మందిరంలో ఏకాంతసేవ నిర్వహిస్తారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం జరిగినప్పటి నుంచి పల్లకీ సేవ జరిగే వరకు ఏకాంతసేవ నిర్వహించరు.

దక్షిణ కైలాసగిరుల్లోని తీర్థాలు

కైవల్య, సరస్వతి, విఘ్నప్రశమన, స్వర్ణముఖి, భరద్వాజ, చంద్ర పుష్కరిణి, సూర్య పుష్కరిణి, జ్ఞాన ప్రకాశం, నీలకంఠం, గౌరీ, మణికర్ణిక, మయూర, దుర్గ, మూక, హరహర, వజ్ర, చక్ర, విష్ణు, బ్రహ్మ, లక్ష్మీ, మార్కండేయ, వేద, రామ, భక్తి ముక్తి, కాళ, హస్తి, పద్మసేన, విజయ, జపాల, నారద, బ్రహ్మవిద్య, శుక, పరాశర, సహస్ర దేవతా, మృత్యుంజయ తీర్థాలున్నాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



దూర్జటి కళా ప్రాంగణంపై కళాకారుల ప్రదర్శనలు



శ్రీకాళహస్తి రూరల్: దూర్జటి కళా ప్రాంగణంలో బుధవారం రాత్రి కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు, పౌరాణిక నాటికలు, భక్త ప్రవచనాలు భక్తులను అలరించాయి. శ్రీకాళహస్తికి చెందిన శరణ్య, దేవాన్షిత, కృష్ణవేణి నృత్య ప్రదర్శన, శ్రీ సిద్ధేంద్ర కళాపీఠం చింతా రవి బాలకృష్ణ కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సుబ్రమణ్యం, కృష్ణ భక్తి పాటలు, చెన్నైకి చెందిన సునంద, వినోదిని భక్తి రంజని కార్యక్రమం ఆహూతులను అలరించాయి. సతీష్ మృదంగ లయ విన్యాసం, వరంగల్‌కు చెందిన ఎస్‌సీఎస్ కళాక్షేత్రం చందుల యశస్విని గిరిజా కల్యాణం నృత్య రూపకం మంత్ర ముగ్ధులను చేసింది. పెద్ద కనపర్తికి చెందిన శీతాలాంబ నాట్యమండలి సభ్యులు అక్కుపల్లి సుబ్బరామయ్య, శ్రీకృష్ణ రాయభారం, కర్ణ రహస్యం పౌరాణిక నాటికలు, శ్రీ దక్షణామూర్తి నాట్యమండలికి చెందిన నెలబల్లి రోశయ్య ఆధ్వర్యంలో ప్రదర్శించిన సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన అబ్బురపరిచింది.

జోరుగా ఉపాధి పనులు



పని చేస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన ఓటుగుంట పొలాలకు వెళ్లే రోడ్డు మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయని ఫీల్డ్ అసిస్టెంట్ హైమవతి తెలిపారు. ఉపాధి హామి పథకంలో ఓటుగుంట పొలాలకు వెళ్లే రోడ్డు మరమ్మతు కోసం నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్నామని తెలిపారు. రోడ్డుకు యిరువైపుల ఉన్న చెట్టుపొదలను తొలగించే పనులు 15 రోజులపాటు చేయనున్నట్లు చెప్పారు. 130 మంది కూలీలు పని చేస్తున్నారని, కూలీలకు కూలీ గిట్టుబాటు అవుతుందన్నారు.

రేపు జాబ్ మేళా

శ్రీకాళహస్తి: పట్టణంలోని పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ నాగరాజనాయుడు తెలిపారు. జేకేసీ, క్వెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిక్సన్ పరిశ్రమలో అసెంబ్లర్ ఆపరేటర్ ఉద్యోగం కోసం పదవ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన వారు, 18–30 ఏళ్లలోపు స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి జీతం రూ.10,603 నుంచి రూ.14 వేల వరకు ఇస్తారని, అడిషనల్ బెనిఫిట్స్, ఉచిత రవాణా, షిఫ్ట్ సమయంలో ఉచిత అహారం అందజేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, విద్యార్హత సర్టిఫికెట్, పాన్ కార్డు లేదా ఓటర్ కార్డు, బయోడేటా, రెండు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 94405 02338, 98488 98024లో సంప్రదించాలని తెలిపారు.

దుస్థితిలో బస్‌షెల్టర్



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం గ్రామానికి వెళ్లే రోడ్డులో ఉన్న బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరుకుంది. ఈ బస్‌షెల్టర్‌ను మాజీ ఎంపీ వెంకటస్వామి నిధులతో నిర్మించారు. బస్‌షెల్టర్ గ్రామానికి దూరంగా ఉండడంతో దాని లోపల ఉన్న కిటికీలు, కిందపరచిన నాపరాళ్లలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. దీంతో బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరి, నిరుపయోగంగా మారింది. బస్‌షెల్టర్ మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ప్రయాణికులు వాపోతున్నారు.

ఘనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: పట్టణంలోని సన్నిధివీధిలో గల కంచి కామకోటి పీఠం వృద్ధాశ్రమంలో బుధవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు బేడన్ పావెల్ జయంతి సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్కౌట్స్ రాష్ట్ర మండలి సభ్యులు రమేష్‌బాబు, రోవర్ లీడర్ ఉమేష్‌రావు మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు బేడన్‌పావెల్ జయంతిని ప్రపంచ ఆలోచన దినోత్సవంగా జరుపుకుంటారన్నారు. ఆయన స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ నిర్మల, భావన, స్కౌట్ మాస్టర్స్ ఎస్‌కే అజారుద్దీన్, లీడర్లు సుబ్రమణ్యం, వెంకీ, చందు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు అభ్యర్థుల ఎంపిక రేపు

సత్యవేడు: నైపుణ్యాభివృద్ధి కళాశాలలో స్కిల్ నైపుణ్యం కోర్సుల్లో ఉచిత శిక్షణకు ఈనెల 24న సత్యవేడు ఎంపీడీఓ కార్యాలయంలో అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని ఎంపీడీఓ బాలగణేష్ తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడప్ సంయుక్తంగా నిర్వహించనున్న ఈ శిక్షణ కోర్సుల్లో అర్హులైన వారిని ఎంపిక చేస్తారని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తారన్నారు. ఆసక్తిగల డిప్లమో, బీటెక్ పూర్తి చేసినవారు తగు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. శ్రీసిటీ నైపుణ్యాభివృద్ధి కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు.

మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

శ్రీకాళహస్తి రూరల్: మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నరేంద్రకుమార్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం చేపల విక్రయం చేస్తున్న మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా పీఎం మత్స్య సంపద యోజన పథకం ద్వారా సబ్సిడీ రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. అర్హులు మండల సమాఖ్యలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏరియా కోఆర్డినేటర్ పి.డాంగేయాదవ్, ఏపీఎం మునెయ్య పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం చేసుకోండి

వరదయ్యపాళెం: ఓటుహక్కు కలిగిన ప్రతి ఒక్క రూ ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ గౌరీశంకరరావు తెలిపారు. అయన బుధవారం పాత్రికేయులతో మాట్లాడారు. మండలవ్యాప్తంగా ఉన్న పీఎల్‌ఓలకు ఆధార్ కార్డు ఇచ్చి, ఓటరు కార్డుతో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా ఆధార్ అనుసంధానానికి సహకరించాలని కోరారు.

ఆర్థిక సహాయం



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న పాస్టర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: అనారోగ్యంతో మరణించిన ప్రేమ్‌కుమార్ అంత్యక్రియల కోసం పీడబ్ల్యూసీఆర్‌పీఏ పాస్టర్ల అసోసియేషన్ రూ.5 వేల నగదు మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. స్థానిక పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గిరిజన కాలనీకి చెందిన ప్రేమ్‌కుమార్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. దీంతో వారికి పాస్టర్ల అసోసియేషన్ సభ్యులు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యూసీఆర్‌పీఏ అధ్యక్షుడు జాన్‌పీటర్, కార్యదర్శి సురేష్‌బాబు, కోశాధికారి డేవిడ్, సభ్యులు మార్కు తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం పెట్టండి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకంలో రుచికరమైన భోజనం పెట్టాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. ఆయన బుధవారం బుచ్చినాయుడుకండ్రిగ, గాజులపెళ్లూరు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాల్లో ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని చెప్పారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు.

లోకోస్ యాప్‌పై శిక్షణా తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ జ్యోతి

శ్రీకాళహస్తి రూరల్: రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్లకు స్థానిక ఈటీసీ కేంద్రంలో బుధవారం నుంచి 24 వరకు లోకోస్ యాప్‌పై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు డీఆర్‌డీఏ పీడీ జ్యోతి తెలిపారు. ఆమె బుధవారం శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మన రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాల మహిళలు పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. సంఘాల లావాదేవీలు, మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా ఆన్‌లైన్ చేయడంలో దేశంలో మనమే ఆదర్శంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సెర్ప్‌తో ఎన్‌ఆర్‌ఎల్‌ఎంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇతర రాష్ట్రాల్లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన డ్వాక్రా మహిళా సంఘాల్లోని సభ్యులకు మొబైల్‌లో లోకోస్ యాప్ ద్వారా సంఘాల లావాదేవీలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు 15 రోజులు వారి సొంత గ్రామాల్లో పూర్తి స్థాయిలో అవగాహన పొందుతారని పేర్కొన్నారు. తర్వాత వారికి మళ్లీ మూడు రోజులు ఇక్కడ శిక్షణ ఇచ్చి పూర్తిగా ప్రావీణ్యం పొందిన వారిని ఇతర రాష్ట్రాల్లో పనిచేయటానికి పంపించనున్నట్లు చెప్పారు. సెర్ప్ డైరెక్టర్ లావణ్యకుమారి, ఏరియా కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.డాంగే యాదవ్, ఈటీసీ ప్రిన్సిపాల్ నాగపద్మజ తదితరులు పాల్గొన్నారు.

నమో నారసింహా..



సింహ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

శ్రీకాళహస్తి రూరల్: తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు బుధవారం రాత్రి స్వామివారు నరసింహ అవతారంలో యోగ ముద్రలో సింహ వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారు ముత్యపు పందిరిపై ఆశీనులై భక్తులను కటాక్షించారు. రాత్రి స్వామిని అలంకార మండపానికి వేంచేపు చేసి సింహ వాహనంపై అధిష్టింపజేసి ఊరేగించారు. అనంతరం ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు గురువారం ఉదయం స్వామి వారు కల్పవృక్ష వాహనంపై విహరిస్తారు. రాత్రి సర్వభూపాల వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు.

స్వీపర్ పార్వతి నిజాయితీ



చైర్మన్‌కు బంగారు ఆభరణం ఇస్తున్న పార్వతి

శ్రీకాళహస్తి: ముక్కంటీశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం గిరి ప్రదక్షిణకు వచ్చిన భక్తురాలు బంగారు ఆభరణం పోగొట్టుకుంది. బూడిదిమిట్టకు చెందిన స్వీపర్ పార్వతి ఆలయంలో శుభ్రపరుస్తుండగా బంగారు ఆభరణం దొరికింది. ఆమె దాన్ని ఆలయ బోర్డు సభ్యుడు మున్నరాయల్‌తో కలిసి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. ఆయన పార్వతి నిజాయితీని అభినందించారు. బంగారు ఆభరణం విలువ రూ.50 వేలు ఉంటుందని తెలిపారు. ఆభరణం పోగొట్టుకున్న వారు ఆధారాలు చూపి తీసుకోవాలని ఆయన కోరారు.

జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు నాగలాపురం విద్యార్థులు



రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓ, టీచర్లు

పిచ్చాటూరు: జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు నాగలాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ బాబయ్య తెలిపారు. బుధవారం సాయంత్రం పోటీలకు ఎంపికైన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఎంఈఓ అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లా ఎర్రగుంటలో జరిగిన అండర్ 17 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో నాగలాపురం పాఠశాలకు చెందిన దివ్యభారతి, సంజయ్, దివ్య జట్టు విజయానికి తోడ్పడడంలో కీలకం కావడంతో వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. శ్రీకాకుళంలో జరిగిన కబడ్డీ పోటీల్లో పవన్‌సాయి మనోజ్, ప్రకాశం జిల్లాలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో గుహన్‌రాజ్, కర్నూలులో జరిగిన పరుగుపందెం పోటీల్లో వరుణ్ తేజ్, తిరుపతిలో జరిగిన రోల్‌బాల్ పోటీల్లో ప్రభాస్ సత్తా చాటి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అలాగే జిల్లాస్థాయి అండర్ 14 కబడ్డీ పోటీల్లో రాజాత్తి, ఆరాధన, సబిన్, విక్కీ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు బాబు, సురేంద్రను ఎంఈఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభాకర్ రాజు, పాఠశాల కమిటీ చైర్మన్ దేశన్, టీచర్లు దీపిక రాణి, వెంకట్రామరాజు, అయ్యప్ప పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు



అన్నదానం చేస్తున్న చుక్కలనిడిగల్లు సర్పంచ్ చుక్కల కిరణ్

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుడి గిరిప్రదక్షిణలో భాగంగా బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలోనూ, చుక్కలనిడిగల్లు సర్పంచ్ చుక్కల కిరణ్ ఆధ్వర్యంలోనూ, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు భక్తులకు అన్నదానం చేశారు. పాలకమండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు, బియ్యపు ఆకర్ష్ రెడ్డి, 1982–83 విద్యార్థులు వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఎస్పీ విశ్వనాథ్‌ను ఘనంగా సన్మానించారు.